**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.3, Issue-1(2), January, 2016**
**Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in**

# 'వరవిక్రయం' నాటకం - సామాజిక స్పృహ

('Varavikrayam' Play - Social Consciousness)

**డా. డి.కె.ప్రభాకర్**

తెలుగు విభాగం, జ్ఞానభారతి క్యాంపస్
బెంగళూరు విశ్వవిద్యాలయం
బెంగళూరు - 56.
చరవాణి:07795444919.
Email: dkprabhakar99@gmail.com

## నేపథ్యం

భారతదేశ సమాజంలో 19వ శతాబ్ది ప్రారంభంలో అనేక సాంఘిక దురాచారాలుండేవి. బాల్య వివాహాలు, సతీసహగమనం, వర్ణ విభేదాలు, భ్రూణ హత్యలు, ఆడ శిశువుల వధ, ప్రథమ సంతానాన్ని గంగా నదిలో పారవేయడం లాంటి దురాచారాలు ప్రధానంగా స్త్రీలకు సంబంధించినవే. దీనికి కారణం ఆనాటి ప్రజలకు పాత ఆచారవ్యవహారాల పట్ల గౌరవభావం, నిక్షరాస్యత, పురుష ప్రధాన వ్యవస్థ, సంస్కరణలకు ప్రోత్సాహం లేకపోవడం లాంటి వాటిని ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. 19వ శతాబ్ది చివరి దశలో భారత జాతీయోద్యమ నాయకులు సమాజంలోని దురాచారాల సమస్యల్ని తొలగిస్తేగానీ భారతీయ సంఘం సంఘటితంగా ఉద్యమం సాగించలేదని భావించి జాతీయోద్యమంతో పాటు మత-సాంఘిక సంస్కరణోద్యమాల ప్రాముఖ్యాన్ని ప్రచారం చేశారు.

భారతీయుల్లో మత-సాంఘిక సంస్కరణావశ్యకత పట్ల ఉత్సాహం, స్ఫూర్తి కలగడానికి గల కారణం పాశ్చాత్య విద్యా ప్రభావం, క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు, బ్రిటీష్ వారి పరిపాలన, వారు ప్రవేశపెట్టిన చట్టాలు, శాస్త్ర-సాంకేతిక అభివృద్ధి, సమాచార వ్యవస్థల వల్ల భారతీయుల్లో మత-సాంఘిక సంస్కరణల పట్ల గొప్పగా ప్రభావితం చేశాయి. దీంతో ఆనాటి భారతీయ సమాజంలో వేళ్ళూనుకొనివున్న దురాచారాల నిర్మూలనకు రాజారామ్ మోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వంటి సాంఘిక మత సంస్కర్తలు ఆవిర్భవించారు. 19వ శతాబ్దంలో తలెత్తిన ఈ సంస్కరణోద్యమాలు సమాజంలో మార్పులకు నాంది పలకడంతో పాటు, భవిష్యత్ సంస్కరణ ఉద్యమాలకు మార్గదర్శకమయ్యాయి. వీరి స్ఫూర్తితో నూతన భావాలతో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, గురజాడ అప్పారావు, ఇంకా అనేక మంది సంస్కరణవాదులు ఆవిర్భవించారు. వీరు సాహిత్యాన్నే ఆయుధంగా చేసుకొని సంఘసంస్కరణకై పాటుపడ్డారు.

## శ్రీ కాళ్ళకూరి నారాయణరావు పరిచయం

సాంఘిక దురాచారాల్ని రూపుమాపడానికి సాహిత్యం సాధనంగా ఉద్యమిస్తున్న కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు గార్లు శ్రీ కాళ్ళకూరి నారాయణరావుని ప్రభావితం చేశారు. అప్పటి నుండి నవీన భావాల్ని, సంస్కరణ వాదాన్ని సంప్రదాయ పద్ధతిలో జోడించి, అటు సంప్రదాయ వాదుల్ని ఇటు అభ్యుదయ వాదుల్ని తృప్తిపరిచే రీతిలో నాటకాలు వ్రాసి, పండిత పామరుల్ని కూడా ఆకర్షించిన నాటక రచయిత శ్రీ కాళ్ళకూరి నారాయణరావు.

శ్రీ కాళ్ళకూరి నారాయణరావు పశ్చిమ గోదావరి జిల్లా 'మత్స్యపురి'లో 28.04.1871న జన్మించి, 27.06.1927న దైవాధీనులయ్యారు. కాళ్ళకూరి అభ్యుదయ భావజాలం గల సంస్కరణవాది. వీరు బ్రహ్మసమాజ మతం స్వీకరించి రఘుపతివెంకటరత్నం నాయుడు గారికి సహచరునిగా సంఘ సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. కాకినాడ నుండి వెలువడిన 'మనోరంజని' పత్రికకి సంపాదకత్వం కూడ వహించారు. శ్రీ కాళ్ళకూరి చిత్రాభ్యుదయం, పద్మవ్యూహం అనే పౌరాణిక నాటకాలూ, ప్రహసనాలూ రాసినా ఆయనకి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టినవి మాత్రం చింతామణి (1921), వరవిక్రయం (1923), మధుసేన (1926) వంటి సాంఘిక ప్రయోజనం గల నాటకాలే.

నారాయణరావు నాటక కర్తే కాదు మంచి నటుడు కూడ. నలదమయంతి నాటకంలో నల, బాహుక పాత్రల్ని కాళ్ళకూరి పోషిస్తే టంగుటూరి ప్రకాశం పంతులు గారు దమయంతి వేషం వేసేవారు. నారాయణరావుకి ఆయుర్వేదం, ఫోటోగ్రఫీ, యోగాభ్యాసాలలో మంచి ప్రవేశముండేది. అధ్యాపకులుగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. పద్యనాటకాలూ, పౌరాణిక నాటకాలూ విజృంభిస్తున్న రోజుల్లో వాటికి ధీటుగా సాంఘిక నాటకం రాసి ప్రజల, రచయితల దృష్టిని మళ్ళించిన వారు శ్రీ కాళ్ళకూరి. వీరి చింతామణి నాటకం వాడవాడలా ప్రదర్శింపబడి అఖండ ఖ్యాతిని ఆర్జించింది. వేశ్యల వ్యామోహంలో పడి ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకొని మాన మర్యాదలకు దూరమౌతున్న వారికి హెచ్చరికగా, వేశ్యావృత్తి నిర్మూలనే ధ్యేయంగా 'చింతామణి' నాటకాన్ని రచించారు. మద్యపానానికి బానిసలైన యువ తరానికి కనువిప్పుగా మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ రాసిన నాటకం 'మధుసేవ'. వరకట్న దురాచారానికి నిరసనగా రాయబడింది 'వరవిక్రయం'. శ్రీ కాళ్ళకూరి నారాయణరావు గారు నవల, కథ, చరిత్ర, వ్యాసం మొదలైన ఇతర ప్రక్రియల్ని కూడా నిర్వహించారు. వీరు మొత్తం 7 నాటకాలు, 13 ప్రహసనాలు, ఒక నవల, 3 కథలు, 3 విమర్శనా గ్రంథాలు, 3 చరిత్రకు సంబంధించిన గ్రంథాలు, 11 వ్యాసాలు, 10 కవితలు, 2 చిత్ర కావ్యాలు వ్రాశారు. సుమారుగ వీరి రచనలన్నీ 58 దాకా వున్నాయి.

## వరకట్న దురాచారం

నాటి నుండి నేటి వరకు సమాజాన్ని పట్టిపీడిస్తున్న సాంఘిక దురాచారాలలో వరకట్నం ఒకటి. ఆ రోజుల్లో రజస్వల కాకముందే ఆడపిల్లకు వివాహం చేయాలనే నియమం ఉండేది. ఒకవేళ వివాహానికి ముందే ఆడపిల్ల రజస్వల అయిందంటే ఆ తల్లిదండ్రుల్ని గ్రామం నుండి బహిష్కరించేవారు. అందువల్ల ఎనిమిది సంవత్సరాలు కుమార్తెకు నిండాయంటే తల్లిదండ్రులకు వరాన్వేషణలో ఉరుకులు పరుగులు మొదలయ్యేవి.

దీన్ని అవకాశంగా చేసుకొని మగపిల్లల తల్లిదండ్రులు కొండెక్కి కూర్చునేవారు. కట్నాలను బలవంతంగా దండుకొనేవారు. 1920లో బ్రిటీషు ప్రభుత్వం బాల్యవివాహాల్ని నిషేదిస్తూ 'శారదా బిల్లు' చట్టాన్ని తెచ్చింది. అయినా బాల్యవివాహాలు ఆగలేదు. బ్రిటీషు పాలనలో లేని ప్రాంతాలకు వెళ్ళి రజస్వలా పూర్వ వివాహాలు జరిపించేవారు. కట్నాలు ఇవ్వలేని తల్లిదండ్రుల మానమర్యాదలకు మంగళహారతే. ఆత్మాభిమానం గల కన్యలకు ఆత్మహత్యలే శరణ్యం. ఈ దురాచారానికి చలించిపోయిన కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' వ్రాసి, ఆ నాటకాన్ని ప్రదర్శింపజేసి యువలోకానికి ఒక సామాజిక సందేశాన్ని అందించారు.

వరకట్నంలాగే కన్యాశుల్కమనే దురాచారముండేది. ఇక్కడ వధు విక్రయం జరుగుతుంది. సహజంగా సమాజంలో పురుషుల కంటే స్త్రీల జనాభా తక్కువ. పురుషులలో అవివాహితులు ఎక్కువ. అందువల్ల పెద్దగా ఇబ్బంది రాదు. స్త్రీల జనాభా బాగా తగ్గితే వధువుల కొరత ఏర్పడి కన్యాశుల్కం ప్రబలుతుంది. స్త్రీ పురుషుల జనాభా దరిదాపుల్లోకి వచ్చిన కొద్దీ వరకట్న దురాచారం పెరుగుతుంది. వరకట్నం ఇప్పటికీ ఊడల మర్రిలా విస్తరిస్తూనే వుంది. అయితే ఒక్క తేడా పూర్వం దురాచారాలలో తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువ. కానీ ఇప్పుడు వరులు ఎక్కువ మంది తమ రేటును తామే ప్రకటించుకుంటున్నారు. ప్రస్తుతం స్త్రీ శిశు, భ్రూణ హత్యలు పెరుగుతున్నాయి. మళ్ళీ సమాజంలో కన్యాశుల్కం వచ్చే అవకాశం లేకపోలేదు.

## వరవిక్రయం పాత్రల పరిచయం

ఆనాటి సమాజంలో బలమైన సాంఘిక దురాచారాలలో ఒకటి కన్యాశుల్కం. దీన్ని రూపుమాపడానికై సంఘసంస్కరణే లక్ష్యంగా సాంఘికేతివృత్తాన్ని స్వీకరించి ప్రజావ్యవహారిక భాషలో 1897లో గురజాడ అప్పారావుగారు 'కన్యాశుల్కం' నాటకం రచించారు. ఇది రచించిన దాదాపు పాతికేళ్ళకు వరకట్నమనే దురాచారాన్ని వస్తువుగా చేసుకొని 1923లో శ్రీ కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' అనే సాంఘిక నాటకాన్ని రాశారు. ఈ నాటకంలో పుణ్యమూర్తుల పురుషోత్తమరావు, భ్రమరాంబ, సింగరాజు లింగరాజు, సుభద్ర, కాళింది, కమల, బసవరాజు, పెండ్లిండ్ల పేరయ్య, వివాహాల వీరయ్య, న్యాయాధిపతి, ఘంటయ్య, వెర్రిబుర్రల వెంగళప్పల ప్రముఖమైన పాత్రల చిత్రణ కన్పిస్తుంది.

**పుణ్యమూర్తుల పురుషోత్తమరావు**: వరవిక్రయం నాటకంలో ప్రధాన పాత్ర ఇతనిది. కొన్ని ఆదర్శాలు, విలువలు పాటించే గాంధేయ వాది. ఇది స్ఫురించేట్లు నాటక కర్త ఈ పేరును నామకరణం చేశారు. వరకట్నం అతి పెద్ద దురాచారమని, దాని నిర్మూలనకై ఎంతో కృషి చేశారు. కానీ తన స్వంత విషయంలో తన సిద్ధాంతాలకు విరుద్ధంగా తప్పనిసరి పరిస్థితుల్లో తన కుమార్తెల వివాహానికి కట్నం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. ఆదర్శాలు, సిద్ధాంతాలు చెప్పటానికి, వినటానికి ఎంత బాగుంటాయో ఆచరించటం ఎంత కష్టమో పురుషోత్తమరావు పాత్రను చూస్తే మనకు అర్థమవుతుంది. భ్రమరాంబ ఈయన భార్య. కాళింది, కమలలు వీరి కుమార్తెలు. పది సంవత్సరాల పాటు పైసా లంచం పుచ్చుకోకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా ఉద్యోగం చేశాడు. పైగా సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని ఉద్యోగం కూడా వదులుకున్నాడు.

**భ్రమరాంబ**: ఈమె పురుషోత్తమరావు భార్య. ఉత్తమ ఇల్లాలు. భర్తలాగే గాంధీ సిద్ధాంతాలపై విశ్వాసం కలది. ఈమె భర్తకు సమయానికి తగిన సలహాలనిచ్చే నేర్పరి. అందరిలాగే తన కుమార్తెలకు మంచి అల్లుళ్ళు రావాలని

ఆరాటపడుతుంది. సింగరాజు లింగరాజు పెంపుడు కొడుకు బసవరాజుకు తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తే బాగుంటుందని భావించి, ఆ విషయాన్ని భర్తకు తెలియజేస్తుంది. పిల్లల బాగుకోసం ఆస్తిని అమ్మటంలో భర్త అభిప్రాయాన్ని సమ్మతించింది.

**సింగరాజు లింగరాజు**: ఇతను పరమ పిసినారి, లోభి. ఈ నాటకానికి ప్రతినాయకుడు. మంచి మర్యాదలు బొత్తిగా లేవు. ఈతనికి ధనమే ప్రధానం. యాభై సంవత్సరాలొచ్చినా మూడవ వివాహం చేసుకున్న ఘనుడు. సంతానం లేక పెంచుకున్న కుమారుడు బసవరాజును అడ్డం పెట్టుకొని కట్నాల వ్యాపారం ప్రారంభించాడు. నాటకంలో ఇతని చేష్టలు ఇతర పాత్రలకు దు:ఖం కల్గించినా, ప్రేక్షకులకు మాత్రం చక్కని హాస్యాన్ని అందిస్తాయి. కన్యాశుల్కంలో గిరీశం, చింతామణి నాటకంలో సుబ్బిసెట్టి, వరవిక్రయానికి సింగరాజు లింగరాజులు ప్రత్యేక ఆకర్షణలు.

**సుభద్ర**: సింగరాజు లింగరాజు మూడవ భార్య. అందం, చదువు, సంస్కారం అన్నీ వున్నా వరకట్నానికి బలై సింగరాజుకు భార్యయింది. అత్యంత కటుకుడైన భర్త వల్ల ఆమెకు కష్టాలు తప్ప సుఖాలు ఎన్నడూ ఎరగని దురదృష్టవంతురాలు.

**కాళింది**: పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పెద్ద కూతురు. అందం, చదువు, సంస్కారం అన్నీ వున్నాయి. తండ్రిలాగే ఆదర్శవాది. వరకట్నానికి వ్యతిరేకి అయినా చివరకు కట్నం ఇవ్వక తప్పలేదు. లింగరాజు పెంపుడు కొడుకు బసవరాజుతో కాళిందికి వివాహం నిశ్చయమయినప్పటికీ కట్నం కోసం తండ్రి పొలం అమ్మవలసి రావడంతో కలత చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తమ ఆశలు, ఆశయాలు ఫలించనప్పుడు మనిషి ఎలా ప్రవర్తించకూడదో తెలియజెప్పడానికి నారాయణరావు ఈ పాత్రను సృష్టించారు.

**కమల**: ఈమె పురుషోత్తమరావు రెండవ కుమార్తె. అందం, చదువుతో పాటు ధైర్యం, తెలివితేటలున్న యువతి. ఈమె కాళింది వలే కాక ఆశయాలు తీరనందుకు మరణం పరిష్కారం కాదని, కాలానుగుణంగా నడుస్తూ యుక్తిని, తెలివిని ఉపయోగించి విజయం సాధించాలనే నేర్పరితనం కలది కమల. ఈ నాటకానికి నాయిక కమలేనని చెప్పొచ్చు. అక్క మరణంతో బసవరాజును వివాహమాడి తన తెలివితేటలతో కోర్టులో న్యాయవాది సహాయం లేకుండా వాదించి లింగరాజుకు బుద్ధి చెప్పించి సంస్కరణవాదాన్ని నెగ్గించింది. ఆడది అబల కాదని నిరూపించింది.

**బసవరాజు**: వరవిక్రయం నాటకానికి నాయకుడు. సింగరాజు లింగరాజు పెంపుడు కుమారుడు. రూపం, గుణం రెండూ వున్న ఆదర్శమూర్తి. వరకట్న వ్యతిరేకి అయినప్పటికీ తండ్రి ప్రోద్బలంతో కట్నం తీసుకోవడానికి ఒప్పుకున్నాడు. పెండ్లి కుమార్తెగా నిర్ణయించబడిన కాళింది మరణంతో ఆమె చెల్లెలు కమలను వివాహం చేసుకున్నాడు. కథాంతంలో సంస్కరణవాదిగా ఎదిగి భార్యతో పాటు వరకట్న దురాచార నిర్మూలనకై ప్రచారం చేశాడు. శ్రీ కాళ్ళకూరి ఆశించిన ఆదర్శ యువకుడు బసవరాజు.

**పెండ్లిండ్ల పేరయ్య**: పెళ్ళిళ్ళు కుదిర్చే మధ్యవర్తి. ఈ కాలంలో మధ్యవర్తులతో పాటు మ్యారేజీ బ్యూరోలు కూడా నెలకొన్నాయి. వివాహాన్ని ఒక వ్యాపార రంగంగా మార్చాయి. ఈ మధ్యవర్తులు వధువరుల తల్లిదండ్రుల నుండి కొంత పైకం తీసుకోంటారు. అయితే పేరయ్య పచ్చి మోసగాడు. అంతే కాదు వివాహాల వీరయ్యతో లాలూచీపడి కట్నం వేలంపాట పెట్టి పురుషోత్తమరావును మోసగించిన మోసగాడు. పురుషోత్తమరావు పొలాన్ని అల్లుడి పేరుతో తక్కువ ధరకు కాజేసిన మహానుభావుడు.

**వివాహాల వీరయ్య**: ఇతను కూడా పెండ్లిండ్ల పేరయ్యలాంటి మధ్యవర్తే. వీళ్ళిద్దరూ తోడు దొంగలు. పెళ్ళిని వ్యాపారంగా మార్చి మనుషుల్ని మోసగించే పచ్చి మోసగాళ్ళు.

**న్యాయాధిపతి**: కమల, బసవరాజుల విషయం కోర్టుకు వచ్చింది. న్యాయాధిపతి ఉదార భావంతో కమల వాదనను విని, సామాజిక న్యాయాన్ని దృష్టితో పెట్టుకొని తీర్పునిచ్చిన మానవతావాది. బసవరాజు తండ్రిని ధిక్కరించి న్యాయ మార్గంలో నడిచినందుకు అతణ్ణి అభినందించాడు న్యాయాధిపతి.

**ఘంటయ్య**: సింగరాజు లింగరాజు ఇంట్లో పనిచేసే వంట మనిషి. బ్రాహ్మణుడు. మంచి వ్యక్తిత్వం గలవాడు. యజమాని పిసినారి తనాన్ని తట్టుకోలేక చివరకు లింగరాజును ధిక్కరించి, ఇలాంటి మూర్ఖుడి దగ్గర పని చెయ్యనని వెళ్ళిపోతాడు.

**వెర్రిబుర్రల వెంగళప్ప**: సింగరాజు లింగరాజు తరుపున న్యాయవాది. తాల్లూకా బోర్డు ప్రెసిడెంటు. దురాశాపరుడు. తాల్లూకా బోర్డు అధ్యక్షుడిగా వుంటూ ఉపాధ్యాయుల్ని పీడిస్తూ లంచాలు గుంజే ధన పిశాచి.

### వరవిక్రయం కాలం నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు

గాంధీ సారథ్యంలో స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో 1923లో శ్రీకాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' నాటకాన్ని రాశారు. గాంధీజీ సహాయనిరాకరణ ఉద్యమ ప్రభావంతో కాళ్ళకూరి వారు తన ఉద్యోగానికి రాజీనామా చేసి అందులో పాల్గొన్నారు. ఆయన కుటుంబం మొత్తం గాంధేయ మార్గాన్ని చేబట్టింది. కరువు రాక్షసిని సంహరించే సుదర్శన చక్రంలా రాట్నాన్ని భావించి నూలు వడికే వారు. ఈ చరఖా ఉద్యమంలో అనేక మంది పాల్గొన్నారు. విద్యార్థులు తమ చదువులకు స్వస్తి పలికి, ఉద్యోగులు తమ ఉద్యోగాల్ని త్యజించి ఉద్యమాల్లో పాల్గొని అనేక మంది జైలుపాలయ్యారు. ఈ విషయాల్ని పుణ్యమూర్తుల పురుషోత్తమరావు ద్వారానే కాళ్ళకూరి వారు సమాజానికి తెలియజేశారు. ఇది ఆనాటి రాజకీయ పరిస్థితి.

ఆ రోజుల్లో రజస్వల కాకముందే ఆడపిల్లలకు వివాహం చేసే ఆచారం కొనసాగుతూ వుండేది. ఇంతకంటే మునుపు వివాహానికి ముందే కుమార్తె రజస్వల అయితే తల్లిదండ్రుల్ని గ్రామాన్నించి బహిష్కరించే ఆచారం వుండేది. కానీ ఈ నాటక రచనా కాలంనాటికి అంత తీవ్రత, బహిష్కరించే ఆచారం లేదుకానీ రజస్వల అయిన అమ్మాయికి పెళ్ళి కావటం చాలా కష్టంగా ఉండేది. కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం, పీఠాపురం రాజా వంటి మహానుభావుల కృషి, ప్రోత్సాహం వల్ల ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజ మతం ప్రచారంలోకి వచ్చింది. అనేక మంది సంస్కరణ వాదులు ఆ మతంలో చేరారు. బ్రహ్మ సమాజ మతంలోని యువకులు రజస్వల అయిన కన్యల్ని వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చేవారు. పేరయ్యచే చెప్పించిన అమలాపురంలో

వున్న అయ్యగారి అంబయ్యగారి వృత్తాంతమే దీనికి నిదర్శనం. అంబయ్య కుమార్తె రజస్వల అయినా బ్రహ్మ సమాజానికి చెందిన ఒక యువకుడు పెళ్ళి చేసుకున్నాడని, వారి దాంపత్యం చక్కగానే సాగుతున్నదనీ ఆమె అయిదుగురు బిడ్డల తల్లయిందని చెప్పిస్తాడు. అందువల్లే పురుషోత్తమరావు కాళిందికి పదమూడు సంవత్సరాలు నిండకపోయినా పెళ్ళి చేయాలని ఆరాటపడ్డాడు.

పురుషులతో పాటు ఆడపిల్లలు కూడా చదువుకోవటం ప్రారంభించారు. కాళింది, కమల, సుభద్ర కూడా చదువుకున్నవారే. సుభద్ర కథలు, నవలలు చదవటాన్ని నాటకంలో చూడవచ్చు. స్త్రీలు అప్పుడప్పుడే ఇల్లు దాటి సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటున్నారనే దానికి నిదర్శనంగా నాటకం చివరలో వరకట్న నిర్మూలన ఉద్యమంలో కమల, సుభద్రలు పాల్గొనటం గమనించవచ్చు. సాంస్కృతిక స్వాతంత్రోద్యమాలలో ఎంతో మంది స్త్రీలు పాల్గొన్నారు. స్త్రీ పురుషుల మధ్య స్నేహ సంబంధాలు అప్పుడప్పుడే ప్రారంభమయ్యాయి. వరంగల్‌లో ఒక యువతి ప్రేమించి మోసపోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటనే దీనికి నిదర్శనం.

సంఘ సంస్కరణవాదులమని వేదికలపై ఉపన్యాసాలిచ్చే ప్రబుద్ధులు ఎక్కువయ్యారు. అయితే ఆచారణలో మాత్రం వాటిని పాటించేవారు కాదు. బాపిరాజనే సంఘసంస్కరణవాది తన ఆరేళ్ళ కుమార్తెను నలభై ఏళ్ళ వాడికిచ్చి పెళ్ళి చేశాడు. మరో సంస్కరణవాది శీనయ్య తన పదాహారేళ్ళ చెల్లి భర్త చనిపోతే పునర్వివాహం చెయ్యకుండా ఇంటి దగ్గరే ఉంచాడు. ఇలాంటి దొంగ సంస్కరణవాదులు ఆ కాలంలోనే మొదలయ్యారు.

ఆ రోజుల్లో వరకట్నం ప్రధాన సమస్యగా ఉండేది. చదువును బట్టి కట్నం నిర్ణయించబడి ఉండేది. దీనికి తోడు పెండ్లి కుమార్తె తల్లిదండ్రుల నుండి వాచీలు, ఉంగరాలు, మోటారు సైకిళ్ళ వంటివి లాంఛనాల రూపంలో వరులు గుంజేవారు. విదేశాల చదువులు రావడంతో ఆ ఖర్చులు కూడా ఆడపిల్ల తల్లిదండ్రుల పైనే వేయాలని వరుల తల్లిదండ్రులు ప్రయత్నించే వారు. పై చదువుల కోసం నగరాలకు వచ్చిన యువకులు రకరకాల క్రాఫింగులతో, సిగరెట్లు కాల్చుతూ, కిళ్ళీలు నములుతూ హెూటళ్ళ చుట్టూ తిరుగుతూ పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడుతున్న రోజులవి. ఇలా తలకు మించిన వృథా ఖర్చులు పెట్టే యువకులు ఒక ప్రక్కన కనబడుతుంటే, సింగరాజు వంటి లోభులు, కట్నాల బ్రోకర్లు మరో ప్రక్కన మనకు నాటకంలో దర్శనమిస్తారు. ఒక్కొక్క పెళ్ళికి ఒక్కొక్క కట్నం తీసుకునే దుష్టులను లింగరాజు పాత్ర మూలంగా నాటకంలో చూయించారు రచయిత. దీనివల్ల వరుడి రూపం, విద్య, వయస్సుల కంటే ధనానికే పెద్ద పీట వేశారనే సంగతి అర్థమౌతుంది. ఆడపిల్లల చదువు, వంశ గౌరవం, అందానికంటే వరకట్నమే ప్రధాన పాత్రను పోషించేది. సుభద్ర లింగరాజుల దాంపత్యం అప్పటి వికృత సంప్రదాయానికి నిదర్శనం.

ఆ కాలంలో జరిగే ఐదు రోజుల పెళ్ళిళ్ళ వల్ల, అల్లుళ్ళ గొంతెమ్మ కోర్కెలతో వధు తల్లిదండ్రులు అనేక సమస్యల్ని ఎదుర్కొనేవారు. పురుషోత్తమరావు మాటల్లో చెప్పాలంటే అల్లుడు ఒక విధంగా మామకు తాళి కట్టని మొగుడులాంటి వాడు. కమల బసవరాజులకు అయిదు రోజుల పెళ్ళి జరిగింది. ఆ రోజుల్లో వరుడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు సకల సౌకర్యాల్ని కల్పించినా నిష్ఠూరాలు తప్పేవి కాదు. పురుషోత్తమరావు మాటల్లో ఆడపిల్ల పెళ్ళి చేయటం కంటే అశ్వమేథయాగం చేయటం చాలా తేలిక. వధువు తల్లిదండ్రులకు ఆ ఐదు రోజులు దినదిన గండంగానే ఉండేది. ఆ రోజుల్లో మగ పెళ్ళివారంటే గ్రామ దేవతలతో సమానమే. ఈ

అయిదు రోజుల పెళ్ళిళ్ళ వల్ల చాలా మంది దివాలా తీసేవారు. తాలుకా బోర్డులు – వాటి అధ్యక్షులు, ఎన్నికలు, ఓట్లు కొనటం లాంటివి ఆనాడే ప్రారంభమయ్యాయి. అలా అడ్డదారిలో తాలూకా బోర్డు అధ్యక్షునిగా ఎన్నికైన వాడే వెర్రిబుర్రల వెంగళప్ప. ఆ రోజుల్లోనే వార్తా పత్రికలు ప్రచారంలోకి వచ్చాయి. ఇలా అనేక విషయాలతో శ్రీ కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' నాటకాన్ని ఆనాటి సామాజిక పరిస్థితులకు దర్పణంగా తీర్చిదిద్దారు.

## సామాజిక స్పృహ

మహాకవి కాళ్ళకూరి నారాయణరావు గారు 'వరవిక్రయం' నాటకం ద్వారా కథా కాలంనాటి స్థితిగతుల్ని ఎత్తి చూపిస్తూనే రాబోయే కాలంలో ఎదురయ్యే సమస్యల్ని, ప్రజల్లో రావాల్సిన మార్పుని కూడా చూయించారు. కథా కాలంలో వరులకు వారి హెూదాల్ని బట్టి కట్నాల రేట్లు వుండేవి. స్కూలు ఫైనలు వాడికి రెండువేలు, ఇంటరు వాడికి మూడువేలు, బి.ఏ. వాడికి నాలుగు వేలు కట్నాల రేట్లుండేవి. అంటే దీన్ని బట్టి రాబోయే కాలంలో ఈ రేట్లు ఏ స్థాయికి చేరుకుంటాయో అనే సామాజిక సందేశాన్ని ముందుగానే అందించారు. ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా అందరూ ఈ దురాచారానికి బలిపశువులు అవుతారని, అందువల్లే ఈ వరకట్నమనే మహమ్మారిపై పోరాడాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

ఆధునిక సమాజంలో వరకట్నం ఒక వ్యాపారంలా మారింది. ఈ విషయాన్ని కాళ్ళకూరి ఆనాడే వరవిక్రయం నాటకం ద్వారా చెప్పారు. ఈ నాటకంలో లింగరాజు ఒక కట్నాల వ్యాపారి. తన కొడుకు బసవరాజుకు పోటీ పాట పెట్టించి మరీ కట్నం పెంచి పుచ్చుకున్నాడు. దీనికి రసీదు కూడా ఇచ్చాడు. ఇవన్నీ వ్యాపార లావాదేవీలకు సంబంధించినవిగా కన్పిస్తాయి. వరకట్నం తీసుకోవడం వల్ల వరుడు వధువుకు అమ్ముడు పోయినట్లేననే సందేశాన్ని కమల పాత్ర ద్వారా నిరూపించాడు. అందువల్ల భార్యకు నిత్య సేవ చేస్తుండాల్సిందే అంటాడు నారాయణరావు. రజస్వల కాకుండా వివాహం చేసే పద్ధతిలో మార్పు రావాలనే విషయాన్ని బ్రహ్మ సమాజ మతంలోని యువకుల ద్వారా సమాజానికి అందించారు. పేరయ్య చెప్పిన అమలాపురంలో వున్న అయ్యగారి అంబయ్యగారి వృత్తాంతమే దీనికి నిదర్శనం. అంబయ్య కుమార్తె రజస్వల అయిన తర్వాతనే ఒక బ్రాహ్మణ సమాజ యువకుడు వివాహం చేసుకున్నాడు. వారి దాంపత్యం చక్కగానే సాగుతుంది. ఆమె అయిదుగురు బిడ్డల తల్లి అయింది. అంటే రజస్వల అయినా కానీ పెళ్ళిళ్ళు అవుతాయని, వాళ్ళు కూడా పిల్లాపాపలతో సంతోషంగా ఉంటారనే దృశ్యాన్ని చూపించారు. బాల్య వివాహాల్లో మార్పును ఆశించారు. సంఘ సంస్కర్తలమంటూ వేదికలపై ఉపన్యాసాలిస్తూ ఆచరణలో మాత్రం శూన్యమనే సంగతిని బాపిరాజు, శీనయ్యల ద్వారా నిరూపించాడు. బాపిరాజనే సంస్కరణవాది తన ఆరేండ్ల కుమార్తెను నలభై ఏళ్ళ వాడికిచ్చి పెండ్లి చేశాడు. శినయ్య చెల్లెలి భర్త చనిపోతే ఆమెకు పునర్వివాహం చేయకుండానే ఇంట్లోనే పెట్టుకున్నాడు.

అన్ని వ్యాపారాల్లాగే పెళ్ళిళ్లకు కూడా దళారీలుంటారనీ, ఈ దళారులు కుమ్మక్కై వధువు తల్లిదండ్రుల్ని ఏ విధంగా మోసం చేస్తారో అనే దాన్ని పెండ్లిండ్ల పేరయ్య, వివాహాల వీరయ్యల మూలంగా హెచ్చరించాడు. పెండ్లి సంబంధాలు కుదిరిస్తే పుణ్యం వస్తుందనే ధార్మిక దృష్టి పోయి కమీషను వస్తుందనే వ్యాపార దృష్టితో ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారనే స్పృహను కల్పించాడు. నేటి కాలానికి ఇవి మ్యారేజీ బ్యూరోలుగా ఎదిగి వ్యాపార సంస్థలుగా మార్పు చెందాయి. అందువల్ల ఇలాంటి మోసాల్ని పసిగట్టాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

పురుషులతో పాటు స్త్రీలు కూడా ఇల్లు దాటి సామాజిక ఉద్యమాల్లో పాల్గొనాలనే అవసరాన్ని కమల, సుభద్రల మూలంగా చెప్పించారు. నాటకం చివరలో వరకట్న నిర్మూలన ఉద్యమంలో భ్రమరాంబ, కమల, సుభద్రలు పాల్గొనటం గమనించవచ్చు. అయిదు రోజుల పెళ్ళిళ్ళ వల్ల, అల్లుళ్ల గొంతెమ్మ కోర్కెల మూలంగా వధువు కుటుంబం ఎలా దివాలా తీస్తుందో చూపించారు. పురుషోత్తమరావు మాటల్లో ఆడపిల్ల పెండ్లి చేయటం కంటే అశ్వమేధయాగం చేయటం తేలికంటాడు. అందుకే పెళ్ళిళ్ళలో సమూల మార్పులు రావాల్సిన అవసరాన్ని ప్రజల నుండి ఆశించారు రచయిత. ఎన్నికలు,  ఓట్లు ఎంత కలుషితమౌ తున్నాయో తాల్లూకా బోర్డు ప్రెసిడెంటు వెర్రిబుర్రల వెంగళప్ప పాత్ర ద్వారా చూపిస్తూ, ఎన్నికల్లో రావాల్సిన సమూల మార్పుల్ని సమాజానికి తెలియజేశాడు.

'ఇంటి ముందు దేవాలయాన్ని పెట్టుకొని శక్తి లేకున్నా తిరుపతికి వెళ్ళి బాధపడ్డట్లు, ఉత్తములెందరో మన కళ్ళముందు వివాహం లేకుండా ఉంటే వాళ్ళని కాదని కట్నం తీసుకోవడమే గౌరవంగా భావించే వారి దగ్గరకు ఎందు కెళ్లాలనే' వాస్తవ సత్యాన్ని కాళింది పాత్ర మూలంగా అందించాడు. దూరపు కొండలు నునుపన్న భావనను మనస్సు నుండి తొలగించుకోవాలని భావించాడు. మన బలహీనతల్ని ఆసరాగా చేసుకొని మనల్ని మోసగించే మోసగాళ్ళ గురించి వివరించారు. పురుషోత్తమరావుకి ఎక్కడా అప్పు పుట్టకపోవడంతో కూతురి పెళ్ళి కోసం పొలం అమ్మటానికి సిద్ధపడ్డప్పుడు పేరయ్య తన అల్లుడి పేరుతో తక్కువ ధరకే పొలాన్ని కాజేసి, పురుషోత్తమరావుని మోసగించిన సంగతే ఇందుకు నిదర్శనం. కొన్ని సందర్భాలలో తమ పిల్లల అభిప్రాయాలకు కూడా విలువనివ్వాలని లేని పక్షంలో ఎటువంటి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందోనన్న విషయాన్ని కాళింది పాత్ర ద్వారా సమాజానికి ఒక సందేశాన్ని ఇచ్చారు. కట్నం తీసుకున్న వరుడితో తాళి కట్టించుకోవడం కంటే త్రాడుతో ఉరేసుకోవటం గౌరవప్రదమయిందని కాళింది చెప్పింది. ఈ నీచకృత్యం కంటే వివాహం చేసుకోకుండా వుండటమే మంచిదని, తనకు ఇంగ్లీషు పాఠం చెప్పిన దొరసాని నలభై ఏళ్ళొచ్చినా అవివాహితగానే ఉందని తల్లిదండ్రుల్ని ఒప్పించటానికి ప్రయత్నించింది. కానీ వారు ఆమె మాటల్ని తీవ్రంగా పరిగణించలేదు. దీంతో కలత చెందిన  కాళింది ఆత్మహత్య చేసుకుంది. ఇది పిల్లల ఆలోచనలకు, అభిప్రాయాలకు పెద్దలు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను చూపిస్తుంది.

సమాజంలో యువకులు యువతుల్ని ప్రేమ పేరుతో ఎలా మోసగిస్తున్నారో ఈ నాటకం కళ్ళకు కట్టినట్లు చూయించింది. ఓరుగల్లులో ఒక యువతి ఒక యువకుణ్ణి ప్రేమించి, వాడు ఆరువేలు కట్నం ఇస్తే గాని పెళ్ళి చేసుకోనని చెప్పడంతో వాళ్ళ తల్లిదండ్రులు ఆ కట్నం ఇవ్వలేక వేరే సంబంధం చూడటంతో ఆ యువతి నిరాశతో విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్న సంగతే దీనికి నిదర్శనం. నారాయణరావు ఈ నాటకంలో పత్రికలకుండవలసిన సామాజిక బాధ్యతను కూడా తెలియజేశాడు. పత్రికలు వార్తల్ని వ్రాసేటప్పుడు సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని రాయాలని బోధించాడు. పత్రికల్లోని వార్తలు ప్రజల్ని ఏ విధంగా ప్రేరేపిస్తాయో కాళింది పాత్ర మంచి ఉదాహరణ. కాళింది మనస్సు అయోమయ స్థితిలో వున్నప్పుడు పత్రికలో వచ్చిన వరంగల్లు వార్తను చదివి ప్రేరేపితురాలై ఆత్మహత్యకు పురికొల్పింది. అందువల్ల పత్రికలకి సామాజిక బాధ్యతను తెలియజేస్తూ ఆత్మహత్య పిరికివారు చేసే పని, చచ్చి సాధించేది ఏమీ లేదనే భావం స్ఫురించేట్లు పత్రికలో వార్త వచ్చి వుంటే కాళింది మరణించేది కాదేమో ! అన్నట్లు చెప్పారు. అంతేకాక మన మాటలు ఎదుటి వారికి ధైర్యం కల్గించాలి కానీ, ఇతరుల బలహీనతల్ని బలపరిచేలా ఉండకూడదని కమల పాత్ర ద్వారా చెప్పించారు. కమల అనాలోచితంగా అన్న మాటలు కాళింది ఆత్మహత్యా ప్రయత్నాన్ని మరింత హెచ్చించాయి. సమస్యల్లో చిక్కుకున్న వారు ఎలా

ప్రవర్తించకూడదో, వారి విషయంలో ఇతరులు ఎలా వ్యవహరించకూడదో అన్న సందేశాన్ని సమాజానికి చెప్పడానికే కాళింది పాత్రను సృష్టించారు కాళ్ళకూరి నారాయణరావు గారు.

లింగరాజులాంటి దుష్టులకు, బసవరాజులాంటి అమాయకులకు బుద్ధి చెప్పడానికి, సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతను కల్పించడానికి కమల పాత్రను సృష్టించారు. ఆధునిక స్త్రీలకు ఆదర్శప్రాయమయింది కమల చరిత్ర. వరకట్న నిషేధం ప్రచారంలో కట్నం కోసం చదివే యువకుల్ని, లాంఛనాలంటూ పీడించే వరుల్ని విమర్శించాడు. కట్నం తీసుకుంటే భార్యకు అమ్ముడుపోయినట్లేనని, బ్రతికున్నంత వరకు అత్తగారింట్లో సేవ చెయ్యాలని, అలా చెయ్యకపోతే వచ్చే జన్మలో కుక్కలై పుట్టి ఆ రుణం తీర్చుకోవల్సి వస్తుందనే సామాజిక సందేశాన్ని ఇచ్చి యువకుల్ని హెచ్చరించాడు రచయిత. దీనికి బసవరాజు పాత్రే నిదర్శనం. భార్య ఏవిధంగా భర్తకు చేదోడువాదోడుగా ఉండాలో భ్రమరాంబ పాత్ర మూలంగా ప్రేక్షకులకు అందించారు. ఈడుజోడు, విద్య, పరువు ఇవేమీ చూడకుండా వయస్సు మీరిన ధనాశాపరుడైన లింగరాజులాంటి వారికి అమ్మాయిల్నిచ్చి పెళ్ళి చేస్తే ఆడదాని బ్రతుకు అడవి కాచిన వెన్నెలవుతుందని సుభద్ర ద్వారా చెప్పించారు కాళ్ళకూరి.

## ముగింపు

వరవిక్రయం నాటకం ద్వారా సమాజంలోని వరకట్నం లాంటి దురాచారాలపై పోరాడాలనే సందేశంతో పాటు సామాజిక స్పృహను కల్గించడానికి ప్రయత్నించారు కాళ్ళకూరి నారాయణరావు. ఈ నాటకంలో ప్రధానంగా సాంఘిక ప్రయోజనం కన్పిస్తుంది. నాటక ప్రస్తావనలో 'వరశుల్క దుర్నయ దూరీకరణమునకై' ఈ నాటకాన్ని రచిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా యువతీ యువకుల్లో మార్పు రావాలనే ఆశయం ఈ నాటకంలో స్ఫురిస్తుంది. కమల ధైర్యంగా కోర్టులో పోరాడింది. దీంతో బసవరాజుతో పాటు లింగరాజులో కూడా మార్పు వచ్చింది. బసవరాజు పురుషోత్తమరావు కుటుంబంతో కలిసి వరకట్న దురాచార నిర్మూలనకై పోరాడుతాడు. కాళ్ళకూరి ఈ నాటకంలో బోధించిన మరో విషయం వార్తా పత్రికలకు సంబంధించినది. పత్రికలు వార్తలు వ్రాసేటప్పుడు సామాజిక స్పృహతో వ్రాయాలని రచయిత అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పటికీ చాలా పత్రికలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవట్లేదనే చెప్పాలి. 'చచ్చి సాధించేది ఏమీ లేదు. బ్రతికి పోరాడాలి' అన్న గొప్ప సందేశాన్ని యువతరానికి కాళింది, కమల పాత్రల ద్వారా అందించారు. కమల పోరాడి గెలిచిన ధీరురాలు. నేటి స్త్రీలకు ఆదర్శప్రాయురాలు. ఈ నాటకం ద్వారా సాంఘిక ప్రయోజనాన్ని ఆశిస్తూ సామాజిక సందేశాన్ని మనందరికీ అందించారు కాళ్ళకూరి నారాయణరావు గారు.

## ఉపయుక్త గ్రంథ సూచి

1. శ్రీ కాళ్ళకూరి నారాయణరావు : వరవిక్రయం నాటకం
2. డా.కందిమళ్ళ సాంబశివరావు : తెలుగు నాటక రంగం, కాకతీయ ప్రచురణ, చిలకలూరి పేట.
3. ఎన్.తారకరామారావు, సాధుశ్యాంప్రసాద్ (సం) : 20వ శతాబ్దపు నాటకరంగం.
4. డా.ద్వా.నా.శాస్త్రి (2001): తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
5. డా.జి.నాగయ్య (2004): తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
6. తెలుగు సాహిత్య కోశము ఆధునిక సాహిత్యం (1851-1950), తెలుగు అకాడమి, హైదరాబాదు, 1999.

**డా. డి.కె.ప్రభాకర్**
తెలుగు విభాగం, జ్ఞానభారతి క్యాంపస్
బెంగళూరు విశ్వవిద్యాలయం
బెంగళూరు - 56.
చరవాణి:07795444919.

